అగ్రపథాన కొండవెలగాడ

- సంక్షేమ పథకాలకు రూ.18.31 కోట్లు
- అభివృద్ధి పనులకు మరో రూ.6.81 కోట్లు
- గ్రామం అభివృద్ధి చెందడంపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఆహ్లాదకరమైన వాతావరణంలో కొండవెలగాడ గ్రామ సచివాలయం



సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గ్రామ పెద్దలు

ఊరు మారింది

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారాయి. మారుమూల గ్రామాల్లో సైతం విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో పల్లెల్లో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలకు నోచుకోని ప్రజలు.. ప్రస్తుత ప్రభుత్వంలో పథకాల లబ్ధి చేకూరడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా మహిళలు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తూ సమాజంలో గౌరవంగా బతుకుతున్నారు.. జిల్లాలో అత్యంత చైతన్యవంతమైన గ్రామాల్లో కొండవెలగాడ ఒకటిగా చెప్పుకోవచ్చు..ఇక్కడ ఎక్కువ మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తారు. సుమారు 5,600 పైచిలుకు జనాభా ఉన్న ఈ గ్రామం ఒకప్పుడు ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి..వెయిట్ లిఫ్టింగ్ క్రీడకు పుట్టినిల్లుగా కొండవెలగాడ పేరొందింది. ఇక్కడ క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటడంతో గ్రామం పేరు దశదిశలా వ్యాపించింది. గత సార్వత్రిక ఎన్నికల్లో 90 శాతానికి పైగా ఓటర్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు పలికారు. జెడ్పీటీసీ సభ్యుడిగా ఉన్న గదల సన్యాసినాయుడు గ్రామానికి ప్రాతినిథ్యం వహిస్తుండగా, ఆయన మాతృమూర్తి బంగారమ్మ సర్పంచ్‌గా, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎంపీటీసీ సభ్యురాలిగా మొయిద కళావతి ఉన్నారు.

మారిన రూపు రేఖలు...

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ గ్రామంలో కనీసం 30 శాతం మందికి కూడా సంక్షేమ పథకాలు అందలేదు. అభివృద్ధి కూడా అంతంతమాత్రమే కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. శిథిలావస్థలో ఉన్న ఉన్నత పాఠశాల అభివృద్ధికి నిధులు కూడా మంజూరు చేయకపోవడంతో దాతల సహకారంతో అప్పట్లో పాఠశాలను అభివృద్ధి చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామం రూపురేఖలే మారాయి. నూతన ప్రభుత్వ భవనాలను అందుబాటులోకి తీసురావడంతో ప్రజలకు ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. సీసీ రహదారు, డ్రైన్లు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది ఎప్పుడికప్పుడు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. వలంటీర్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారు.

జగన్‌బాబు 'చేయూత'నిచ్చారు



జగన్‌బాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత మా బతుకుల్లో మార్పులు వచ్చాయి. టీడీపీ ప్రభుత్వంలో మాకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందలేదు. చేయూత పథకం ద్వారా ప్రతి ఏటా రూ.18,500 చొప్పున లబ్ధి పొందాను. మా కుటుంబంలో అందరికీ సంక్షేమ పథకాలు అందాయి. ఉన్న ఊరిలోనే అన్ని పనులు జరుగుతున్నాయి. మళ్లీ జగన్‌బాబే ముఖ్యమంత్రి కావాలి.

– జీనపాటి సూరప్పయ్యమ్మ, కొండవెలగాడ

ఎంతో మార్పు వచ్చింది



గత టీడీపీ ప్రభుత్వానికి ఇప్పటికీ చాలా తేడా ఉంది. ఏ పథకం కూడా గతంలో మాకు అందేది కాదు. టైలరింగ్ చేస్తూ వచ్చిన అరకొర భత్యంతో జీవిస్తున్నాను. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతీ ఏటా రూ.10 వేలు చొప్పున నా వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలో పడుతోంది. పిల్లలకు కూడా అమ్మఒడి, విద్యా దీవెన పథకాలతో లబ్ధి చేకూరుతోంది.

– మజ్జి సంతోషి, టైలర్, కొండవెలగాడ

డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా లబ్ధి..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవయ్యాయి. అమ్మఒడి, విద్యాకానుక, వసతిదీవెన, రైతుభరోసా, పింఛన్ కానుక, తదితర 25 పథకాలకు గాను ఒక్క కొండవెలగాడ గ్రామానికే రూ. 18.31 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. అలాగే నాన్ డీబీటీ పథకాలకు రూ.6.81 కోట్లు ఖర్చు చేశారు. నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.4.49 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇప్పటివరకు దాదాపు రూ.25 కోట్లకు పైగానే ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు ప్రభుత్వం ఖర్చు చేసింది. గతంలో ఎప్పుడు కూడా ఇంత మొత్తంలో తమకి లబ్ధి చేకూరలేదని ప్రజలు చెబుతున్నారు. ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందుతుండడంతో తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

విజయనగరం: నగరంలోని 44వ డివిజన్ చెంచుల కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి సమకూర్చిన పరుపులు, రగ్గులు, దుప్పట్లను స్థానిక నాయకులు శనివారం అందజేశారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న కోలగట్ల శ్రావణి తక్షణ సహాయం కింద బాధితులకు దుస్తులు, నగదు, బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. బాధితుల అభ్యర్థన మేరకు అవసరమైన రగ్గులు, దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు లంక మహేష్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జామి సూరిబాబు, పాపారావు, రామకృష్ణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డీఎస్పీ

విజయనగరం టౌన్: మండల పరిధిలోని ద్వారపూడి, గుంకలాం, జొన్నవలస, పినవేమలి, రాకోడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, రూరల్ ఎస్సై వాసుదేవ్‌తో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా భద్రతాపరమైన పలు అంశాలపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో రూరల్ పోలీసులు, ఎంఎస్‌పీలు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

నిర్వహణ ఇలాగేనా..?



నిరుపయోగంగా దర్శనమిస్తున్న మంచినీటి యంత్రం

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం దాతలు ఇస్తున్న విలువైన పరికరాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్నేళ్ల కిందట ఓ ప్రముఖ సంస్థ రూ.5 లక్షల విలువ చేసే మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. నీటిని శుద్ధి చేసే యంత్రం పాడైనప్పటికీ ఇంతవరకు బాగు చేయకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. దాతలు సమకూరుస్తున్న విలువైన వస్తువులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కూడా పలువురు దాతలు ఏసీలు, ఫ్యాన్లు, తదితర సామాగ్రిని సమకూర్చారు. యంత్రాలు పాడైన తర్వాత కొత్త దాతల కోసం ఎదురు చూస్తున్నారే తప్ప వాటిని బాగు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శుద్ధ జల యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

చురుకుగా కులగణన సర్వే

నెల్లిమర్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వే మండల వ్యాప్తంగా చురుగ్గా కొనసాగుతోంది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జీఎస్‌డబ్ల్యూఎస్ యాప్‌లో కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తున్నారు. సర్వేను మండల స్థాయి అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. సర్వర్ సమస్య తలెత్తుండడంతో సిబ్బంది ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండి సకాలంలో సర్వే పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీఓ రామారావు సూచించారు.

జోరుగా ..

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వే గ్రామాల్లో జోరుగా సాగుతోంది. మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. సర్వేను ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు పరిశీలించి సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు సూచనలు అందిస్తున్నారు.

ఘనంగా మణిదీప్‌నాయుడు జన్మదిన వేడుకలు



క్యాంపస్ చాలెంజ్‌లో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న బద్దుకొండ మణిదీప్‌నాయుడు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జంక్షన్ క్యాంపస్ చాలెంజ్‌లో వైఎస్సార్‌సీపీ జోన్–2 ఐటీ వింగ్ ఇన్‌చార్జ్ బద్దుకొండ మణిదీప్‌నాయుడు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. జన్మదినం సందర్భంగా దివ్యాంగ విద్యార్థులతో కేక్ కట్ చేయించి భోజనాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మణిదీప్‌నాయుడు మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థుల మధ్య జన్మదినం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, ఎన్. సత్యనారాయణరాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ పట్టాభిషేకానికి సర్వం సిద్ధం

- శ్రీనివాస సేవా సంఘ అధ్యక్షుడు పిళ్లా విజయ్‌కుమార్

విజయనగరం టౌన్: రింగురోడ్డు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు శ్రీనివాస సేవా సంఘ అధ్యక్షుడు పిళ్లా విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఉత్సవాల కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం విశ్వేక్షేన పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 23న శోభాయాత్ర, గోపూజ.. 24న సుదర్శన హోమం, 25 నుంచి మే నెల 11వ తేదీ వరకు ప్రతిరోజూ అష్టాక్షరి మంత్ర జపం రామాయణ మంటపంలో నిర్వహిస్తామన్నారు. రామాయణ పారాయణాలు, హోమాలు, సీతారాముల కల్యాణం, , విష్ణు, లలితా సహస్రనామ పారాయణాలు, జియర్ స్వాములతో ప్రవచనాలు ఉంటాయన్నారు. అలాగే మే 12న అష్టోత్తర శత కలశాభిషేకం, త్యాగరాజ, అన్నమాచార్య కీర్తనలు, 13న పునర్వసు శాంతి కల్యాణం, పట్టాభిషేక తిరువీధి.. 14న ఉదయం 8 గంటల నుంచి శ్రీరామునికి మహాసామ్రాజ్య పట్టాభిషేకం చేస్తామన్నారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి చెరుకూరి శ్రీధర్, సహాయ కార్యదర్శి అల్లాడి శివ రామకృష్ణ, ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, కోశాధికారి సీహెచ్.వెంకటరమణ మూర్తి, ప్రతినిధులు గౌరినాయుడు, వి.హరిబాబు, వి.రమణ, శైలజ, చంద్రిక, ఈశ్వర శ్రీనివాస్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలకు సమాయత్తం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: రాబోయే ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న విశాఖ జిల్లా భీమిలిలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించడంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి సుమారు పది వేల మంది సభకు హాజరయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సభ్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ముంగిటక పాలన తీసుకువచ్చారని కొనియాడారు. జనసేన, టీడీపీ పార్టీలను ఎల్లో మీడియా ఆకాశానికి ఎత్తేస్తున్నాయని, కాని రానున్న ఎన్నికల్లో ప్రజలు మరోసారి బుద్ధి చెబుతారని తెలిపారు. విశాఖ జిల్లా బలమైన కమ్మ సామాజికవర్గం చేతిలోకి వెళ్లిపోయిందన్నారు. రాబోయే ఎన్నికలలో 2019 ఎన్నికల ఫలితాలే మళ్లీ పునరావృతం అవుతాయని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, భోగాపురం, పూసపాటిరేగ వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ ఎన్. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, సుందర హరీష్, పడాల శ్రీనివాసరావు, పడాల భానుప్రకాష్, ఉప్పాడ శివారెడ్డి, బర్రి చినఅప్పన్న, మైలపల్లి నర్సింహులు, గుజ్జు సురేష్‌డ్డి, పడాల శ్రీధర్, కోట్ల రఘు, పి.అప్పడుదొర, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి బహిరంగ సభను విజయవంతం చేయండి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఈ నెల 27న భీమిలిలో జరగనున్న వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావ సభను విజయవంతం చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నియోజకవర్గ పరిశీలకుడు డోల జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కోలగట్ల నివాసంలో పార్టీ విజయనగరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, భీమిలి సభకు ముఖ్య నేతలందరూ తప్పకుండా హాజరుకావాలని కోరారు. ఒక్కొక్క నియోజకవర్గం నుంచి పది వేల మంది వరకు నాయకులు తరలి వస్తారని చెప్పారు. ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు నగరం నుంచి బయలుదేరనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని నేరుగా ఢీ కొనలేకే చంద్రబాబునాయుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో అంటకాగుతున్నాడని ఎద్దేవా చేశారు. అవినీతిరహిత పాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని కోరారు. అలాగే తనకు కూడా మరోసారి అవకాశం ఇస్తే పెద్ద చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది బోటు షికార్ ఏర్పాటు చేస్తానని తెలిపారు.

21 నుంచి ప్రారంభోత్సవాలు..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 21న నగరంలోని మార్కెట్ ప్రాంతంలో భావసాగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు కోలగట్ల తెలిపారు. 28న కోడి రామ్మూర్తి విగ్రహాన్ని, 30న ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద గాంధీ విగ్రహాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే ఫిబ్రవరి ఒకటో తేదీన అంబటిసత్రం నుంచి నీళ్లట్యాంక్ వరకు రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేస్తామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు డోల జగన్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటమి ఖాయమన్నారు. అన్ని వర్గాల ప్రజలూ వైఎస్సార్‌సీపీ తోనే ఉన్నారని చెప్పారు. అందుకే 175 స్థానాల్లోనూ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్, జోనల్ ఇన్‌చార్జ్‌లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మండల పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి...

నెల్లిమర్ల: విశాఖపట్నం జిల్లా భీమిలిలో ఈనెల 27న జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బహిరంగ సభకు పార్టీశ్రేణులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు కారుకొండ వెంకటకృష్ణారావు, సముద్రపు రామారావు, కౌన్సిలర్ చిక్కాల సంతోష్‌కుమార్, గిరిబాబు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

22న శ్రీరామ శోభాయాత్ర



శోభాయాత్ర వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ధార్మిక సంఘాల ప్రతినిధులు

విజయనగరం టౌన్: అయోధ్య శ్రీరామ మందిరంలో ఈ నెల 22న బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో ఆ రోజు శ్రీరామ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీరామకమిటీ నిర్వాహకుడు బర్ల రామారావు తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ధార్మిక సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామభద్రపురం నుంచి రామతీర్థం వరకు శోభాయాత్రను మూడు దశలలో నిర్వహిస్తామన్నారు. రామభద్రపురం అయ్యప్ప పీఠం గురుస్వామి శివస్వామి ఆధ్వర్యంలో 600 మంది భక్తులతో శోభాయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. రామభద్రపురం నుంచి ఆరికతోట వరకు, విజయనగరం, రామతీర్థంలలో మూడు దశలుగా శోభాయాత్ర ఉంటుందన్నారు. యాత్రలో పాల్గొనే భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. ఆరికతోట నుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రామతీర్థం సేవా పరిషత్ వ్యవస్థాపకుడు జ్యోతిప్రసాద్ మాట్లాడుతూ, పలు ధార్మిక సంఘాల సహకారంతో విజయనగరం పట్టణంలో కోట నుంచి మూడు లాంతర్లు, ఫూల్‌బాగ్ అయ్యప్పస్వామి కోవెల వరకు శోభాయాత్ర సాగుతుందన్నారు. అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న సమయంలో వాడవాడలా పండగ వాతావరణం నెలకొనేలా సంబరాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రామతీర్థం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దాట్ల చిట్టిరాజు మాట్లాడుతూ, 22వ తేదీ సాయంత్రం ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలన్నారు. శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హిందూ ధర్మ రక్షా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. వేణుగోపాల్, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు లక్ష్మణ, శ్రీరామ కమిటీ సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

22న అఖండ శ్రీరామతారక మంత్ర భజన

విజయనగరం టౌన్: అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో స్థానిక టీటీడీ ఆవరణలో కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు అఖండ శ్రీరామ తారక మంత్ర భజన ఉంటుందని ఆలయ ప్రధానార్చకుడు పీవీ నరసింహాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి కల్యాణ మహోత్సవం, పుష్పయాగం నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని కోరారు. అదేవిధంగా స్థానిక కంటోన్మెంట్ ఆర్టీసీ కాలనీ పార్కు వద్ద నుంచి ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5 వరకు శ్రీరామ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆర్టీసీ కాలనీ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో దీపోత్సవం

విజయనగరం: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం దీపోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి దేవాలయం వద్ద కోలాటం, తప్పెటగుళ్లు, సన్నాయిమేళం, రామసంకీర్తనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం దీపోత్సవం చేపడతామన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు



విద్యార్థులకు నగదు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, కోలగట్ల శ్రావణి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో 2023 పదో తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి సమకూర్చిన నగదు పారితోషకాలను శాసనమండలి సభ్యుడు డాక్టర్ సురేష్ బాబు అందజేశారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో శనివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు రిషితరెడ్డి, ఇజ్జాడ లోకేష్‌లకు రూ. 20 వేలు చొప్పున.. తాళ్లపూడి ప్రశాంతికి పది వేల రూపాయలు చొప్పున అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు కోలగట్ల శ్రావణి అందించిన ప్రోత్సాహక బహుమతులు అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, తాను ఇచ్చిన మాట ప్రకారం 2023 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు 50 వేల రూపాయల నగదు ప్రోత్సాహకాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు బాలి పద్మావతి, తాళ్లపూడి సంతోషి కుమారి, కస్పా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

విజయనగరం రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో పంచాయతీ వార్డు సభ్యులు, స్వయం సహాయక సంఘాల మహిళలు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ గంటా వెంకటరావు తెలిపారు. విజయనగరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై వార్డు సభ్యులు, స్వయం సహాయక సంఘాల వీఓల పాత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, రిసోర్స్‌పర్సన్ అప్పలనాయుడు, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'తో క్రీడాకారులకు గుర్తింపు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



పూసపాటిరేగ: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలతో గుర్తింపు వస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక వెంకట సీతారామ డిగ్రీ కళాశాల ఆవరణలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన చింతపల్లి, పతివాడ టీమ్‌లకు.. కబడ్డీ పోటీల విజేతలు రెల్లివలస, కొల్లాయివలస... ఖోఖో విజేతలు కుమిలి, పూసపాటిరేగ.. వాలీబాల్ విజేతలు పూసపాటిరేగ, వెంపడాం.. బ్యాడ్మింటన్ విజేతలు కొల్లాయివలస, పూసపాటిరేగ జట్టులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బడ్డుకొండ మాట్లాడుతూ, క్రీడలలో రాణించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడల కోసం కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ప్రతిఒక్కరూ క్రీడలలో భాగస్వామ్యమై ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, మండల వైస్ ఎంపీపీ ఎన్. సత్యనారాయణరాజు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్, కోట్ల రఘు, కొత్తకోట శ్రీరాములు, మహంతి లక్ష్మణరావు, టొంపల సీతారాం, పిన్నింటి కుమార్, తాడిశెట్టి బాబు, మొంగం నాగబాబు, బర్రి చినఅప్పన్న, పి. అప్పడుదొర, ఎడ్ల రామకృష్ణ, ఎంపీడీఓ ఎం. రాధిక, పీడీ కమలానాభరావు, పీఈటీలు సత్యనారాయణ, లీలాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన అలుగోలు

నెల్లిమర్ల రూరల్: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని అలుగోలు గ్రామానికి చెందిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో సత్తా చాటారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన ఈ పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్ విభాగాల్లో మండల స్థాయిలో విజేతలుగా నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు, పీఈటీ శ్రీనివాసరావు అభినందించారు. నియోజకవర్గ స్థాయిలో జరగనున్న క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు.